


పాతపట్నం నియోజకవర్గం

పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి (వైసీపీ).. కడగండి రిజర్వాయర్ నుంచి ఎల్.ఎన్.పేట మండలానికి కాలువలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. ● ఎల్.ఎన్.పేట కూడలి నుంచి కొమనాపల్లి, మోదుగువలస రోడ్డు నుంచి గొట్టిపల్లి, ఏబీ రోడ్డు నుంచి ముంగెన్నపాడు రోడ్డుల అభివృద్ధి హామీ కూడా నెరవేరలేదు. కనీసం మరమ్మతులు సైతం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ● హిరమండలం మండలం పరిధి జిల్లేడుపేట వద్ద మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభించలేదు. ● వంశధార ప్రాజెక్టు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. నాగావళి, వంశధార అనుసంధానం జరగలేదు. వంశధార నదికి కొత్తూరు మండలంలో కరకట్టల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు.

హామీ ఇచ్చారు.. మరిచారు







హిరమండలం పరిధి జిల్లేడుపేట వద్ద మహేంద్రతనయ నదిపై వంతెన లేక అవస్థలు (ఫైల్)

- గత ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చని నేతలు
- ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే
- జిల్లావాసులకు తప్పని అవస్థలు

ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు.. ఎన్నెన్నో వాగ్దానాలు. ఓట్లు వేయించుకున్నారు. గెలిచారు.. అధికారం చేపట్టారు. ప్రజలను మాత్రం మర్చిపోయారు. హామీలు, వాగ్దానాలు గాలికొదిలేశారు. ఇవి ఒకటి, రెండు కాదు.. వందల సంఖ్యలో ఉన్నాయి. గద్దెనెక్కి ఐదేళ్లు పూర్తవుతున్నాయి. ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. రోడ్లూ వేయలేదు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు మాట ఇచ్చి తప్పిన వైనంపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు..

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సిక్కోలు.. వ్యవసాయాధారిత జిల్లా. ప్రధానంగా వలసల జిల్లాగా పేరుగాంచింది. ఐదేళ్లకోసారి ఎన్నికల వేళ.. నేతలు మారుతున్నారు. కానీ, జిల్లావాసుల తలరాతలు మాత్రం మారడం లేదు. ప్రతిసారీ ఎన్నికల్లో ప్రజలకు హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం పరిపాటిగా మారింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లా అభివృద్ధి మరింత వెనుకబడింది. అధికారపార్టీ ఎమ్మెల్యేలు భూదందాలు, ఇసుక.. మైనింగ్ దోపిడీ, సొంత వ్యాపారాలకే ప్రాధాన్యమిచ్చారు. ప్రజాసమస్యల పరిష్కారంపై మాత్రం దృష్టి సారించలేదు. దీంతో జిల్లావాసులకు అవస్థలు తప్పడం లేదు. గత(2019) ఎన్నికల్లో నియోజకవర్గాల వారీ అభ్యర్థులు ఇచ్చిన హామీలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలు తీరును పరిశీలిద్దాం.

నరసన్నపేట నియోజకవర్గం

నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ (వైసీపీ-మాజీ ఉపముఖ్యమంత్రి) నియోజకవర్గంలో తాగునీరు, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఈ సమస్యలు పరిష్కారం కాలేదు. వంశధార కాలువల ఆధునికీకరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. తంపర భూముల అభివృద్ధి ఆగిపోయింది. జలుమూరు మండలం లింగాలపాడు ఎత్తిపోతల పథకం అభివృద్ధి చేయలేదు.

● నరసన్నపేట ప్రధాన రహదారి అభివృద్ధికి రూ.15కోట్లు అవసరం కాగా.. రూ.4.5 కోట్లు మంజూరయ్యాయి. వీటితో భవనాల తొలగింపు పనులు మాత్రమే చేపట్టారు. 2022లో సీఎం జగన్ వచ్చి రూ.10కోట్లు ప్రకటించినా ఇంతవరకు రూపాయి కూడా విడుదల కాలేదు.



నరసన్నపేటలో వంశధార కాలువ దుస్థితి

● ఎచ్చెర్ల నియోజకవర్గం..

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ (వైసీపీ) ప్రజలకు పలు హామీలు ఇచ్చారు. ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం పెద్ద చెరువుకు మడ్డువలస మిగులు జలాలు ఇప్పిస్తామని చెప్పారు. కానీ ఇంతవరకూ నెరవేర్చకపోవడంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

● తోటపల్లి ప్రాజెక్టు ద్వారా రణస్థలం, లావేరు మండలాలకు పూర్తిస్థాయిలో సాగు నీరందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ పిల్ల కాలువల తవ్వకం పూర్తికాలేదు. ఈ ఐదేళ్లలో పనుల ఊసే లేదు.

● ఎచ్చెర్ల మండలం నారాయణపురం కుడికాలువ ఆధునికీకరణ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ పూర్తికాలేదు. టీడీపీ హయాంలో జైకా నిధులు మంజూరు కాగా.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి.

● ఆమదాలవలస నియోజకవర్గం

ఆమదాలవలస నియోజకవర్గానికి స్పీకర్ తమ్మినేని సీతారాం(వైసీపీ) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మునిసిపాలిటీలో పైపులైన్లు వేసి తాగునీరందిస్తామని హామీ ఇచ్చారు. వంశధార నది నుంచి తాండ్రాసి మెట్ట వరకు ప్రధాన పైపులైన్లు ఏర్పాటు చేశారు. అక్కడ పొలాల మీదుగా పైపులైన్ వెళ్లకుండా రైతులు అడ్డుకోవడతో పనులు నిలిచిపోయాయి. సరుబుజ్జిలి కూడలిలో తాగునీటి పథకం ఏర్పాటుపై ప్రతిపాదనలు కూడా రూపొందించలేదు.

● టెక్కలి నియోజకవర్గం..

టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు(టీడీపీ) ఆఫ్‌షోర్ జలాశయం పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచినా.. టీడీపీ ప్రభుత్వం ఏర్పడకపోవడంతో నిధులు మంజూరుకాక.. పనులు పూర్తికాలేదు.

శ్రీకాకుళం నియోజకవర్గం

శ్రీకాకుళం ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు (వైసీపీ).. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. వంశధార ప్రాజెక్టును పూర్తిచేసి శివారుప్రాంత రైతులకు సైతం సాగునీరు అందిస్తామని ధర్మాన హామీ ఇచ్చారు. నేటికీ సాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. కాలువలు అధ్వానంగా మారాయి. ఆధునికీకరణ మాటే మరిచారు. నిర్వహణకు రూపాయి కూడా విదల్చలేదు.

● శ్రీకాకుళంలో రింగు రోడ్డు నిర్మిస్తామని ప్రకటించారు. నేటికీ సర్వేకానీ, భూసేకరణ కానీ జరగలేదు. ప్రతిపాదనల దశలోనే ఆటకెక్కింది.

● అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని, ఇంద్రపుష్కరిణిని ఆధునికీకరిస్తామని ప్రకటించారు. మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇటీవల శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభం కాలేదు.

● శ్రీకాకుళం నగర ప్రజలకు 24గంటలూ తాగునీరందిస్తాం. కంపోస్టు కాలనీలో కుళాయిలు వేయిస్తామని హామీ ఇచ్చారు. కానీ పైపులైన్లు ఎప్పటికప్పుడు పాడై.. నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.

● భైరి ఓపెన్ హెడ్ ఛానల్‌ను పునరుద్ధరించి.. శివారు ఆయకట్టు వరకు సాగునీరందిస్తామని చెప్పారు. కానీ నేటికీ పనులు చేపట్టకపోవడంతో గార మండల రైతులకు సాగునీరందించే పరిస్థితి లేదు.



అరసవల్లి ఇంద్ర పుష్కరిణి దుస్థితి ఇలా..

● హామీ మేరకు కోటబొమ్మాళికి డిగ్రీ కళాశాల మంజూరు చేయించుకున్నా.. ప్రభుత్వం అడ్డుపడి దానిని పలాసకు తరలించింది.

● సంతబొమ్మాళిలో ఇంటింటా కుళాయిలు వేస్తామని హామీ ఇవ్వగా.. ఇంకా 22 గ్రామాల్లో వాటిని ఏర్పాటు చేయాల్సి ఉంది.

● భావనపాడు పోర్టు నిర్మాణం చేపడతామని ప్రకటించారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం భావనపాడులో కాకుండా మూలపేటలో పోర్టుకు శంకుస్థాపన చేసింది. పనులు ప్రారంభ దశలో ఉన్నాయి.

● ఇచ్ఛాపురం నియోజకవర్గం..

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్(టీడీపీ).. ఎక్కువమంది జీవనోపాధి పొందేందుకు వీలుగా కొబ్బరి పార్కు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కాగా.. వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పార్కు ఏర్పాటుపై కదలిక లేదు. బీలబట్టి ఆధునికీకరణ పనుల్లోనూ పురోగతి లేదు.

పలాస నియోజకవర్గం

● పలాస నియోజకవర్గానికి పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పలాస రైలు నిలయం పక్కనున్న ఫైవంతెన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వాస్తవంగా 2008లో అప్పటి ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర ఆధ్వర్యంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2014లో గౌతు శివాజీ హయాంలో మరోసారి శంకుస్థాపన చేశారు. తాజాగా 2021లో మూడోసారి శంకుస్థాపన చేశారు. పనులు మధ్యలోనే నిలిపేశారు.

● ఉద్దానం రైతులు నేరుగా పంటలు విక్రయించేందుకు కాశీబుగ్గ రైతుబజారు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ నెరవేరలేదు.

● పలాసలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్లకు కళాశాల, పోస్టులు మంజూరు చేశారు. ప్రస్తుతం పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో డిగ్రీ కళాశాల నడుస్తోంది. సొంత భవనాలు కట్టలేదు.

● కళింగదళ్ గెడ్డపై దోని నిర్మాణానికి మూడుసార్లు అంచనాలు రూపొందించారు. కానీ పనుల ఊసే లేదు.

● నువ్వులరేవు-మంచినీళ్లపేట వద్ద జెట్టీ ఏర్పాటుకు నిధులు మంజూరైనా బిల్లులు చెల్లించక కాంట్రాక్టరు మధ్యలోనే పనులు నిలిపేశారు.



పలాసలో నిలిచిన రైల్వే వంతెన పనులు



శ్రీకాకుళం కోదండ రామాలయంలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

రాములోరి కల్యాణం

శ్రీరామనవమిని పురస్కరించుకుని జిల్లాలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఊరూరా సీతారాముల కల్యాణం వైభవంగా సాగింది. ఆలయాల్లో భక్తుల తాకిడి కనిపించింది. అంతటా శ్రీరామనామస్మరణ మార్మోగింది. శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డులో శ్రీకోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగదభి రాముడి పరిణయాన్ని పురోహితులు నిర్వహించగా.. భక్తులు పులకించారు. అలాగే మండలవీధి, పీఎన్ కాలనీ, వరసిద్ధి వినాయక ఆలయం, డీసీసీబీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి, పుణ్యపువీధి, బాకర్‌సాహెబ్‌పేట తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. - శ్రీకాకుళం కల్చరల్

ఎన్నికలకు కౌంట్‌డౌన్

- నేడే నోటిఫికేషన్ జారీ
- ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- మే 13న పోలింగ్.. జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారు



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థుల పేర్లు ఖరారు కాగా.. ఎన్నికల ప్రచారం మరింత హోరెత్తనుంది. నామినేషన్లకు ఆయా అభ్యర్థులంతా ముహూర్తం ఖరారు చేసుకున్నారు. జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్‌తో పాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. జిల్లాస్థాయిలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. ఈనెల 25వ వరకు నామినేషన్లను స్వీకరించి.. 26న వాటిని పరిశీలిస్తారు. ఉపసంహరణకు ఈ నెల 29తో గడువు ముగుస్తుంది. వచ్చే నెల 13న పోలింగ్ నిర్వహించి.. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రచారంలో టీడీపీ ముందంజ

ఎన్నికల ప్రచారంలో అధికార పార్టీ వైసీపీ కన్నా.. టీడీపీ ముందంజలో ఉంది. ఇప్పటికే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు జిల్లాకు వచ్చి వెళ్లారు. పలాసలో ప్రజాగళం పేరిట సభ నిర్వహించి.. వైసీపీ పాలనను తూర్పారబట్టారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులు గెలుపు ఆవశ్యకత.. రాష్ట్ర ప్రయోజనాల గురించి జిల్లా ప్రజలకు వివరించారు. మరో వారం రోజుల్లో ముఖ్యమంత్రి జగన్ జిల్లాకు వచ్చి.. ఇక్కడే బస్సుయాత్ర ముగించనున్నట్లు సమాచారం. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కూడా ఈనెలలోనే జిల్లాకు వస్తున్నట్లు సమాచారం.

పులకించిన భద్రగిరి



కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతా రాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



టెక్కలి నియోజకవర్గానికి జిల్లాలోనే ఒక ప్రత్యేకత ఉంది. ఎన్టీఆర్ ఇక్కడి నుంచే పోటీ చేసి గెలుపొందిన చరిత్ర ఉంది. బహుభాషా కోవిదుడు ఆచార్య రోణంకి అప్పలస్వామి పురిటి గడ్డ. అప్పయ్యదొర, ఎర్రన్నాయుడు వంటి ఎందరో మహా నేతలను అందించిన నేల. సువిశాల సాగరతీరం, జాతీయ రహదారి ఈ ప్రాంత సొంతం. నీలిరంగు గ్రానైట్, విదేశీ విహంగాలు ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. మొత్తం 2,34,433మంది ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గంలో గెలుపోటములను శాసించేది మాత్రం కాళింగ సామాజిక వర్గమే.

ఎన్టీఆర్ పోటీచేసిన గడ్డ

- బహుభాషా కోవిదుడు రోణంకి, అప్పయ్యదొర, ఎర్రన్నాయుడు వంటి నేతలను అందించిన నేల
- నీలిరంగు గ్రానైట్‌కు ప్రత్యేకం
- సువిశాల తీరం భావనపాడు ఇక్కడే..
- మొత్తం ఓటర్లు 2,34,433 మంది
- గెలుపోటములను శాసించేది కాళింగ సామాజిక ఓటర్లే
- ఇదీ టెక్కలి నియోజకవర్గ ముఖచిత్రం

(టెక్కలి)

టెక్కలి నియోజకవర్గం 61,196మంది ఓటర్లతో 1952లో ఏర్పడింది. పలాస, బ్రాహ్మణతర్లా, వజ్రపుకొత్తూరు, నందిగాం, టెక్కలి ప్రాంతాలతో ఈ నియోజకవర్గం ఉండేది. 2009లో పునర్విభజన తరువాత 1,78,362మంది ఓటర్లతో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలతో కొత్తగా అవతరించింది. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో 2,34,433 మంది ఓటర్లు ఉన్నారు. టెక్కలి పాత, కొత్త నియోజకవర్గాల్లో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎనిమిది సార్లు, కాంగ్రెస్ పార్టీ ఐదుసార్లు, స్వతంత్రులు మూడుసార్లు, జనతా పార్టీ ఒకసారి గెలుపొందాయి. ఈ నియోజకవర్గంలో ఇప్పటికీ అత్యధిక మెజార్టీ 1994లో ఎన్టీ రామారావు 40,890 ఓట్లు సాధించారు.

ఎన్నో ప్రత్యేకతలు..

టెక్కలి అనగానే ప్రపంచస్థాయిలో నీలిరంగు గ్రానైట్ ఉత్పాదక కేంద్రంగా గుర్తింపు పొందింది. దేశ, విదేశాలకు నీలిరంగు గ్రానైట్ ఎగుమతులు ఈ ప్రాంతం నుంచే. బహుభాషా కోవిదుడు ఆచార్య రోణంకి అప్పలస్వామి పుట్టిన పురిటిగెడ్డ టెక్కలి. నవరసాల తల్లి నౌపడా ఉప్పుగల్లీ దేశంలోనే ఉప్పు ఉత్పాదనలో మూడో స్థానం పొందిన ప్రాంతం ఇక్కడిదే. భారతదేశంలోనే అతిపెద్ద సహజ శివలింగం గల రావివలస ఎండలమల్లిఖార్జునస్వామి ఆలయం, పెలికాన్, పెయింటెడ్ స్టార్ విదేశీ విహంగాల విడిది కేంద్రం తేలినీలాపురం, భావనపాడు సాగరతీరం, పెద్దబాణాపురం నుంచి వాండ్రాడ వరకు 50 కిలోమీటర్ల జాతీయరహదారి, తిలారు, హరిశ్చంద్రాపురం, కోటబొమ్మాళి, నౌపడా రైల్వేస్టేషన్ల మనిహారం, 200 పడకల జిల్లా కేంద్ర ఆసుపత్రి, 1952లో బ్రిటీష్ కాలం నాడే సబ్‌కలెక్టర్ కార్యాలయం, 1974లోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల వంటివాటితో పాటు 826.51 ఎకరాల్లో రూ.4,361కోట్లతో పోర్టు నిర్మాణం ఈ నియోజకవర్గ ప్రత్యేకతలుగా చెప్పవచ్చు.

తొలి విజేత స్వతంత్ర అభ్యర్థి..

టెక్కలి నియోజకవర్గం 1952లో ఏర్పాటైన తరువాత తొలి సారిగా జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి రొక్కం లక్ష్మీనర సింహదొర 607 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 1955లో రొక్కం లక్ష్మీనరసింహదొర కాంగ్రెస్ పార్టీ తరఫున 533 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 1962లో రోణంకి సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థిగా 9,190 ఓట్లు, 1967లో నిచ్చర్ల రాములు స్వతంత్ర అభ్యర్థిగా 8,947 ఓట్లు, 1972లో సత్తారు లోకనాథంనాయుడు ఇందిరా కాంగ్రెస్ తరఫున 14,504 ఓట్లు, 1978లో జనతా పార్టీ నుంచి బమ్మిడి నారాయణస్వామి 13,704 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1983లో తెలుగుదేశం పార్టీ నుంచి అట్టాడ జనార్ధనరావు 19,716ఓట్ల మెజార్టీతో, 1985లో టీడీపీ నుంచి వరదా సరోజ 21,571 ఓట్లు, 1989లో టీడీపీ అభ్యర్థి దువ్వాడ నాగావళి 7,434 ఓట్లు, 1994లో ఎన్టీ రామారావు 40,890 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎన్టీఆర్ రాజీనామాతో 1995 ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన హనుమంతు అప్పయ్యదొర 22,197 ఓట్లు, 1999లో టీడీపీ అభ్యర్థి డాక్టర్ కొర్ల రేవతీపతి 3,392ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2004లో కాంగ్రెస్ తరఫున హనుమంతు అప్పయ్యదొర 17,271 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. నియోజకవర్గ పునర్విభజన నేపథ్యంలో 2009లో డాక్టర్ కొర్ల రేవతీపతి కాంగ్రెస్ పార్టీ నుంచి 1,893 ఓట్లు, 2009 ఉప ఎన్నికల్లో కొర్ల భారతి కాంగ్రెస్ నుంచి 7,171 ఓట్లు, 2014లో టీడీపీ నుంచి కింజరాపు అచ్చెన్నాయుడు 8,387 ఓట్లు, 2019లో టీడీపీ నుంచి కింజరాపు అచ్చెన్నాయుడు 8,857 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు.

- 2009 నాటికి రద్దయిన హరిశ్చంద్రపురం నియోజకవర్గానికి సంబంధించి 1967లో స్వతంత్ర అభ్యర్థిగా కింజరాపు కృష్ణమూర్తి 5,672 ఓట్ల మెజార్టీతో, 1972లో కాంగ్రెస్ నుంచి కేపీ భుక్త 19,737 ఓట్ల మెజార్టీతో, 1978లో కేపీ భుక్త 2,311 ఓట్లు, 1983లో టీడీపీ నుంచి కింజరాపు ఎర్రన్నాయుడు 14,190 ఓట్లు, 1985లో టీడీపీ నుంచి కింజరాపు ఎర్రన్నాయుడు 18,139 ఓట్లు, 1989లో కింజరాపు ఎర్రన్నాయుడు స్వతంత్ర్య అభ్యర్థిగా 18,824 ఓట్లు, 1994లో కింజరాపు ఎర్రన్నాయుడు టీడీపీ నుంచి 27,220 ఓట్లు మెజార్టీతో, 1996 ఉప ఎన్నికల్లో కింజరాపు అచ్చెన్నాయుడు టీడీపీ నుంచి 32,271 ఓట్లు, 1999లో టీడీపీ తరఫున అచ్చెన్నాయుడు 38,717 ఓట్లు, 2004లో టీడీపీ నుంచి కింజరాపు అచ్చెన్నాయుడు 37,361 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు.


ఆచార్య రోణంకి అప్పలస్వామి


ఎన్టీ రామారావు


సత్తారు లోకనాథం నాయుడు


హనుమంతు అప్పయ్యదొర


డాక్టర్ కొర్ల రేవతీపతి


కొర్ల భారతి


బమ్మిడి నారాయణస్వామి


నౌపడా ఉప్పు పరిశ్రమ


కింజరాపు ఎర్రన్నాయుడు


కింజరాపు అచ్చెన్నాయుడు


దువ్వాడ నాగావళి


నీలిరంగు గ్రానైట్‌తో తయారు చేసిన మోర్నమెంట్ బొమ్మలు


టెక్కలి నియోజకవర్గ మ్యాప్

ఓటర్ల వివరాలు..

2024 ఓటర్ల జాబితా ప్రకారం టెక్కలి నియోజకవర్గంలో 2,34,433మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,16,981 మంది, మహిళలు 1,17,442 మంది, ఇతరులు పదిమంది ఉన్నారు. 18 నుంచి 19 సంవత్సరాల లోపు 4,816మంది, 20 నుంచి 29 ఏళ్లలోపు 39,399మంది, 30 నుంచి 39 సంవత్సరాల లోపు 59,724మంది, 40 నుంచి 49 ఏళ్ల లోపు 50,689 మంది, 50 నుంచి 59 సంవత్సరాల లోపు 39,632 మంది, 60 నుంచి 69 ఏళ్లలోపు 24,838మంది, 70 నుంచి 79 ఏళ్లలోపు 11,875 మంది, 80 సంవత్సరాలు పైబడిన వారు 3,460మంది ఓటర్లు ఉన్నారు.

ఎగరని వైసీపీ జెండా..

టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ, కాంగ్రెస్, ఇందిరాకాంగ్రెస్, జనతా, స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందినప్పటికీ వైసీపీ జెండా మాత్రం ఇంతవరకు ఎగరలేదు. 2014లో దువ్వాడ శ్రీను, 2019లో పేరాడ తిలక్ వైసీపీ తరఫున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి అచ్చెన్నాయుడు చేతిలో ఓటమి పొందారు. ప్రస్తుత ఎన్నికల్లో దువ్వాడ శ్రీను, అచ్చెన్నాయుడు మధ్య పోటీ నెలకొంది. కాగా, ఈ నియోజకవర్గం పునర్విభజనకు ముందు వారసత్వ రాజకీయాలు కనిపించలేదు. నియోజకవర్గ పునర్విభజన తరువాత హరిశ్చంద్రాపురం, టెక్కలి ఒకటిగా ఏర్పడిన తరువాత దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు సోదరుడు కింజరాపు అచ్చెన్నాయుడు వారసత్వ రాజకీయాల్లోకి రాగలిగారు. ఇదే నియోజకవర్గానికి చెందిన డాక్టర్ కిల్లి కృపారాణి 2009 ఎంపీగా ఎన్నికై 2012 నుంచి 2014 వరకు కేంద్రమంత్రిగా పనిచేశారు. ఇదే నియోజకవర్గానికి చెందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రస్తుతం పార్లమెంట్ సభ్యులుగా ఉండగా టెక్కలి నియోజకవర్గానికి చెందిన హనుమంతు అప్పయ్యదొర, డాక్టర్ కణితి విశ్వనాథం సైతం పార్లమెంట్ సభ్యులుగా పనిచేశారు. ఈ నియోజకవర్గంలో కాళింగ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధికం. తరువాత స్థానంలో మత్స్యకారులు, రెడ్డీలు, యాదవులు, శెగిడీలు, ఎస్సీలు, ఎస్టీలు, కాపు, వెలమ, వైశ్య తదితర కులాలకు చెందిన ఓటర్లు ఉన్నారు. ఇక్కడ గెలుపు, ఓటములు శాసించేది మాత్రం కాళింగ ఓటర్లే.



పంతులు గారూ.. ముహూర్తం చూడండి

నరసన్నపేట, ఏప్రిల్ 17: జిల్లాలో ప్రస్తుతం పొలిటికల్ ముహూర్తాల సమయం నడుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేయడానికి అభ్యర్థులు జ్యోతిష్యులను ఆశ్రయిస్తున్నారు. పేరు, రాశి బలాల మీద నామినే షన్ల తేదీలను ఖరారు చేస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల్లో టికెట్ దక్కించుకోవడం ఒక ఎత్తైతే.. ఆ తర్వాత విజయం సాధించడానికి అంగ, అర్థబలంతోపాటు దేవుని ఆశిస్సులు అవసర మని భావిస్తున్నారు. ఎక్కువ మంది ముహూర్తం కలిసివస్తే విజయం సాధిస్తామని నమ్ముతున్నారు. దీంతో తమకు తెలిసిన జ్యోతిష్యులు, పండితులను సంప్రదిస్తున్నారు. నామినేషన్ల ఘట్టం గురువారం నుంచి ప్రారంభంకానుండడంతో పోటీ చేయనున్న అభ్యర్థులు తమ పేరుమీద మంచి ముహూర్తం కోసం పలువురు పండితులను కలిసి ముహూర్తం ఖరారుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే దాదాపుగా జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, లోక్‌సభ సెగ్మెంట్‌కు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రకటించారు. కొన్ని నియోజకవర్గాల్లో గుర్తింపులేని, రిజిస్టర్, చిన్న పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు రంగంలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నారు.

పేరు, రాశి బలాలు మీద నామినేషన్లు తేదీల ఖరారు

జిల్లాలో ఈనెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకానుంది. ఆరోజు గురువారం కావడం, దశమి కొందరికి కలిసి వచ్చే అవకాశం ఉంటుందని పండితులు చెబుతున్నారు. 19న ఏకాదశి తిథి, నక్షత్రం, 20న శనివారం ద్వాదశి పుబ్బ నక్షత్రం కావడంతో ఆ రోజు నామినేషన్ వేసేందుకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. 21న సెలవురోజు, 22న చతుర్దశి తిథి కాగా, హస్త నక్షత్రం, 23న పౌర్ణమి మంచిదే కానీ మంగళవారం సెంటిమెంట్‌తో ఎక్కువ మంది నామినేషన్ వేసేందుకు ముందుకురాకపోయే అవకాశముంది. 24, 25 తేదీలో పాడ్యమి స్వాతి, విశాఖ నక్షత్రాలు కావడంతో ఆరోజు నామినేషన్ల దాఖలకు మంచిదని పండితులు చెబుతున్నారు. తమ పేరు, రాశి బలాలను బట్టి అభ్యర్థులు నామినేషన్ తేదీలను నిర్ణయించడానికి వేదపండితులను అభ్యర్థులు ఆశ్రయిస్తున్నారు.

కాలగర్భంలో కలిసిన పది నియోజకవర్గాలు

- పునర్విభజనతో కోల్పోయిన సెగ్మెంట్లు
- అవి ఇక పాత జ్ఞాపకాలే

(రణస్థలం)

స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పాటైంది. కాలానుగుణంగా అవసరం మేరకు మార్పులు, చేర్పులకు, లోపాల సవరణకు రాజ్యాంగం మనకు వెసులుబాటు కల్పించింది. ఇందులో నియోజకవర్గాల పునర్విభజన ఒకటి. జనాభా పెరుగుదలకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన నిర్ణీత కాలవ్యవధిలో చేస్తుంటారు. కాలక్రమంలో కొన్ని నియోజకవర్గాలు చరిత్ర పుటల్లో కలిసిపోతుండగా, మరికొన్ని నియోజకవర్గాలు కొత్త చరిత్రను ఆవిష్కరిస్తుంటాయి. శ్రీకాకుళం జిల్లాను ఒకసారి పరిశీలిస్తే.. చరిత్ర పుటల్లో కలిసిపోయిన నియోజకవర్గాలు పది ఉన్నాయి. ఇందులో పొందూరు, ఎస్ఎంపురం, హొంజరాం, బ్రాహ్మణతర్ల నగరికటకం, హరిశ్చంద్రపురం, ఉణుకూరు, సోంపేట, కొత్తూరు నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడమే నియోజకవర్గాల పునర్విభజన ఉద్దేశ్యమైనప్పటికీ, కొన్నింటి విషయంలో అందుకు విరుద్ధంగా జరుగుతున్నాయని చరిత్ర చెబుతోంది. ఇందులో పొందూరును ప్రముఖంగా చెప్పుకోవచ్చు. 1967లో చీపురుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి విడిపోయి పొందూరు నియోజకవర్గం ఏర్పాటైంది. 1962లో పొందూరు (ఎస్సీ) సెగ్మెంట్ నుంచి కొత్తపల్లి పున్నయ్య (కాంగ్రెస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే పున్నయ్యకు జిల్లా జడ్జి ఉద్యోగం రావడంతో శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1964లో జరిగిన ఉప ఎన్నికలో కొత్తపల్లి నరసయ్య (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. 1967లో ఈ నియోజకవర్గం జనరల్ కేటగిరీకి మారింది. ఆ ఎన్నికల్లో చౌదరి సత్యనారాయణ (స్వతంత్ర పార్టీ) గెలుపొందారు. 1972లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లుకలాపు లక్ష్మణదాసు (కాంగ్రెస్) విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో అప్పటి ఎస్ఎంపురం సమితి అధ్యక్షుడు టంకాల అక్కలనాయుడు (ఇండిపెండెంట్), గురుగుబెల్లి స్వామినాయుడు ఓటమి చవిచూశారు. పొందూరు శాసనసభ్యునిగా ఎన్నికైన లుకలాపు లక్ష్మణదాసు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖామంత్రిగా కూడా వ్యవహరించి, చీపురుపల్లి నుంచి విడదీసి పొందూరులో కొత్తగా తాలుకాను ఏర్పాటుచేశారు. పొందూరు నియోజకవర్గం 18 ఏళ్లకే అంతమైంది. 1978 ఎన్నికల్లో పొందూరు ప్రాంతం చీపురుపల్లి నియోజకవర్గంలో విలీనమైంది. 2004 ఎన్నికల వరకు పొందూరు, జి.సిగడాం మండలాలు చీపురుపల్లి నియోజకవర్గంలోనే అంతర్భాగంగా ఉండేవి. 2009లో జరిగిన పునర్విభజనలో పొందూరు మండలం ఆమదాలవలస నియోజకవర్గంలో, జి.సిగడాం మండలం ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో విలీనమయ్యాయి.



- జిల్లాలో ఎస్ఎంపురం గ్రామానికి ఓ విశిష్టత ఉంది. ఈ గ్రామం కొన్నాళ్లపాటు నియోజకవర్గ, సమితి కేంద్రంగా ఉండేది. 1955లో అవతరించిన ఎస్ఎంపురం సెగ్మెంట్ 1967లో అంతరించిపోయింది. 1955లో జరిగిన ఎన్నికల్లో కృషికార్ లోక్‌పార్టీ అభ్యర్థిగా చౌదరి సత్యనారాయణ ఇక్కడి నుంచి ఎన్నికయ్యారు. 1962లో జరిగిన ఎన్నికల్లో ఆ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బల్లాడ హరప్పడు రెడ్డి (ఇండిపెండెంట్) ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఈ సెగ్మెంట్ ఎచ్చెర్ల అసెంబ్లీగా రూపాంతరం చెందింది. 1952లో అవతరించిన హొంజరాం అసెంబ్లీ నియోజకవర్గం మూడేళ్లకే గతి నుంచి తప్పుకుంది. 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ నుంచి పీసపాటి పుండరీకాక్షాచార్యులు ఎన్నికయ్యారు. ఈ సెగ్మెంట్ పాలకొండలో కలిసిపోయింది. 1955లో అవతరించిన బ్రాహ్మణతర్ల అసెంబ్లీ సెగ్మెంటు 1967లో అంతరించిపోయింది. 1955లో జరిగిన ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ నుంచి కృషికార్ లోక్‌పార్టీ అభ్యర్థి నిచ్చెర్ల రాములు ఎన్నికయ్యారు. 1962లో జరిగిన ఎన్నికల్లో బెండి లక్ష్మీనారాయణమ్మ ఎన్నికయ్యారు. 1967లో ఈ సెగ్మెంట్ టెక్కలి సెగ్మెంట్‌లో కలిసిపోయింది. అలాగే 1965లో ఏర్పాటైన నగరికటకం సెగ్మెంట్ 1978 వరకు కొనసాగింది. ఇక్కడి నుంచి 1955, 1962, 1967లో తమ్మినేని పాపారావు (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. ఆ తర్వాత నగరికటకం నియోజకవర్గం ఆమదాలవలస నియోజకవర్గంగా ఏర్పాటైంది. 2009 నియోజకవర్గ పునర్విభజనలో జిల్లాలోని హరిశ్చంద్రపురం, ఉణుకూరు, సోంపేట, కొత్తూరు నియోజకవర్గాలు అంతరించిపోయాయి. ఉణుకూరు నియోజకవర్గం రాజాంగా ఏర్పడింది. అప్పటికే టెక్కలి నియోజకవర్గంలో హరిశ్చంద్రపురంలోని కొంత ప్రాంతం కలిసింది. సోంపేట నియోజకవర్గంలోని కొంతభాగం కొత్తగా ఏర్పడిన పలాసలో, మరికొంత ప్రాంతం ఇచ్ఛాపురంలో విలీనమైంది. 2009 సంవత్సరంలో జరిగిన పునర్విభజనలో శ్రీకాకుళం జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు 10 అసెంబ్లీ సెగ్మెంట్‌లుగా ఏర్పడ్డాయి. పాలకొండ ఎస్టీలకు, రాజాం ఎస్సీలకు రిజర్వ్ చేశారు. రెండేళ్ల క్రితం జరిగిన జిల్లాల పునర్విభజనలో పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం పార్వతీపురం మన్యం జిల్లాలో, రాజాం నియోజకవర్గం విజయనగరం జిల్లాలో విలీనమయ్యాయి.



నామినేషన్‌కు ఇవి పాటించాల్సిందే

నరసన్నపేట, ఏప్రిల్ 17: జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, లోక్‌సభ సెగ్మెంట్‌కు గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. ఈ నేపథ్యంలో నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులకు ఎన్నికల సంఘం పలు నిబంధనలను అమలు చేస్తోంది. నామినేషన్ దాఖలుచేసే కేంద్రంలోకి అభ్యర్థితో సహా ఐదుగురిని మాత్రమే అనుమతించనున్నారు. అఫిడవిట్‌లో అభ్యర్థులు క్రిమినల్ కేసుల వివరాలు తెలియజేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. నిబంధనలను అతిక్రమిస్తే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడిగా ఈసీ ప్రకటించే కూడా అవకాశముంటుంది.


నరసన్నపేటలో నామినేషన్‌దాఖలు చేసే కేంద్రం వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌బీ డీఎస్పీ త్రినాథరావు, ఆర్వో రామ్మోహన్‌రావు, సీఐ ప్రసాదరావు

నిబంధనలు ఇవీ..

- నామినేషన్ సమయంలో అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే లోపలికి అనుమతిస్తారు.
- నామినేషన్ కేంద్రానికి 100 మీటర్లు వరకు ఎవ్వరిని అనుమతించారు.
- మూడు వాహనాల వరకు మాత్రమే లోపలికి అనుమతిస్తారు.
- నియోజకవర్గం కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి (పని దినాల్లో) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటలు వరకే నామినేషన్లను స్వీకరించనున్నారు.
- అభ్యర్థిని బలపరిచే వ్యక్తి అదే నియోజవర్గానికి చెందిన వారై ఉండాలి.
- గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థికి ఒకరు, అదే గుర్తింపు లేని పార్టీతో సహా స్వతంత్ర అభ్యర్థికి పది మంది బలపరచాలి.
- ఒక్కో అభ్యర్థి కనీసం మూడు నామినేషన్లను అందచేయవచ్చు.
- నామినేషన్ సమర్పించే అభ్యర్థి సెక్యూరిటీ డిపాజిట్ కింద జనరల్ అభ్యర్థి రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థి రూ.ఐదు వేలు చెల్లించాల్సి ఉంటుంది.



నేరచరిత్రపై ప్రకటనలు ఇవ్వాలి

- అభ్యర్థి నేర చరిత్ర ఉంటే కనీసం (ఫారం-26లో అఫిడవిట్‌ను విధిగా జతపరచాలి) మూడు సార్లు ప్రముఖ దినపత్రికలు, చానళ్లకు సుప్రీంతీర్పు ఆదేశాల మేరకు ప్రకటనలు ఇవ్వాలి.
- నామినేషన్ల దాఖలు మొదలు, పోలింగ్ తేదీ నాటికి కనీసం మూడు సార్లు తమ చరిత్రను ప్రజలకు వెల్లడించాలి.
- అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తుచాతప్పకుండా పాటించాలి.
- నామినేషన్ అందజేయడానికి వచ్చిన నాటినుంచి అభ్యర్థి ఎన్నికల ప్రచార ఖర్చును లెక్కించనున్నారు.
- అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించరాదు. ఎక్కడైనా అనుమతిని సువిధ యాప్ ద్వారా రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుంటే వారు అనుమతులను మంజూరు చేస్తారు.
- ఏవైనా ఫిర్యాదులు ఉంటే రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

సీదిరి సార్.. జంతిబంద ఏమైంది?

ఉద్దాన ప్రాంత ప్రజల ఏకైక సాగునీటి వనరు జంతిబంద. సముద్ర పాదభాగానికి ఆనుకొని ఉన్న కొండల ప్రాంతం నుంచి సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని ఒడిసి పట్టుకుంటే ఉద్దానం ఉద్యానవనంగా మారనుంది. దీనికి గాను జంతిబందను రిజర్వాయర్‌గా మలిచేందుకు ఆరు దశాబ్దాలుగా ముఖ్యమంత్రులు, మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఇస్తున్న హామీలు గాలిలో కలిసిపోయాయి. ప్రతిపాదనలు జరిగాయి. గత టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియలోనే నిలిచిపోగా.. ఐదేళ్లు గడిచినా ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. ప్రతిపక్షనేత హోదాలో రిజర్వాయర్ ప్రతిపాదిత స్థలం పక్క రోడ్డునుంచే పాదయాత్ర చేపట్టిన వైఎస్ జగన్ సీఎం అయి ఐదేళ్లు పూర్తయినా జంతిబంద ఊసేలేదు. ప్రస్తుతం ఎన్నికలు రావడంతో జంతిబంద రిజర్వాయర్ మళ్లీ ప్రజలమధ్య నానుతోంది.

(హరిపురం)

- మాట ఇచ్చి తప్పిన మంత్రి అప్పలరాజు
- ఉద్దానంలో కలగా రిజర్వాయర్ నిర్మాణం
- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- సాగు, తాగునీటికి ప్రజల ఇబ్బందులు

- సముద్రంలో కలుస్తున్న నీరు- 5 టీఎంసీలు (అధికారుల అంచనా)
- రిజర్వాయర్‌తో సాగులోకి వచ్చే భూములు- 25 వేల ఎకరాలు
- తాగునీటి వసతి- 220 గ్రామాలకు
- నిర్మాణ వ్యయం- రూ. 10 కోట్లు


జంతిబంద రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రదేశం

ఉద్దానం ప్రాంతంలో ప్రధాన సాగునీటి వనరుగా జంతిబందను మారిస్తే మందస, సోంపేట, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో సుమారు 25 వేల ఎకరాల మెట్ట భూములకు సాగునీరు అందనుంది. రైతుల విన్నపాల మేరకు ఈ ప్రాంతాన్ని సందర్శించిన ప్రతి ఒక్క నాయకుడూ రిజర్వాయరుగా నిర్మించేందుకు కృషి చేస్తామని హామీలిచ్చారు. నేటికీ ఆశలు నెరవేరకుపోగా భూములు పనికిరాకుండా పోయాయి. దీనిని నిర్మిస్తే సాగునీటితో పాటు ఈ ప్రాంతంలో సుమారు 200 గ్రామాలకు తాగునీటి కొరత తీరనుందని పలువురు మేధావులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కాగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాటి ఎమ్మెల్యే గౌతు శివాజీ ప్రత్యేక నీటి పారుదల శాఖ అధికారులతో సర్వే చేసి రూ.185 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. టెండర్లు పిలిచినా ధరలు పెరగడంతో నిధులు ఏమాత్రం సరిపోవని కాంట్రాక్టర్లు వెనుకడుగు వేశారు. ప్రభుత్వం మారడంతో అప్పటినుంచి నేటివరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో ప్రస్తుతం కొత్త ధరలతో జంతిబందను రిజర్వాయర్‌గా మార్చేందుకు కనీసం రూ.10 కోట్ల వ్యయం అవుతుందని సంబంధిత అధికారుల అంచనాకు వచ్చారు. దీంతో వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా కనీసం ప్రయత్నాలు చేయకపోవడంతో రైతుల కల నెరవేరలేదు.


ప్రస్తుతం ఈ చెక్‌డ్యాం నుంచే ఈ ప్రాంతానికి నీరు వెళ్తుంది..

నాయకుల హామీలివీ..

- ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర చేపట్టిన సందర్భంగా హరిపురంలో జెండా ఆవిష్కరించి, అధికారంలోకి వచ్చిన వెంటనే జంతిబందను రిజర్వాయరుగా మారుస్తామని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హామీనిచ్చారు. అధికారం చేపట్టిన తరువాత దాన్ని మరిచిపోయారు.
- పేదల పెన్నిధి సర్దారు గౌతు లచ్చన్న, మాజీ మంత్రి మజ్జి తులసీదాస్ ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదు.
- ఎమ్మెల్యేగా గతంలోనే గౌతు శ్యాంసుందర శివాజీ రిజర్వాయర్ నిర్మాణానికి హామీనివ్వగా, నిధులు కేటాయించి టెండర్ల దశవరకు తీసుకెళ్లారు. నిధులు సరిపోక కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో అక్కడతోనే నిలిచిపోయాయి.
- ఎమ్మెల్సీ మాజీ సభ్యురాలు మజ్జి శారద, మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు, పలాస- కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్, గతంలో ఎమ్మెల్యేగా పోటీచేసిన వజ్జబాబురావు, దివంగత ఎమ్మెల్యే కొర్ల రేవతీపతి, మాజీ ఎంపీ కణితి విశ్వనాథం హామీలిచ్చిన నాయకుల జాబితాలో ఉన్నారు.
- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రిగా ధర్మాన ప్రసాదరావు బహాడపల్లిలో మాట్లాడు తూ జంతిబంద నిర్మాణానికి హామీనిచ్చి మరిచారు.
- గత ఎన్నికల సమయంలోనూ, అనంతరం మంత్రి సీదిరి అప్పలరాజు జంతిబందను పరిశీలించి రిజర్వాయర్‌గా నిర్మాణం చేపడతామన్న హామీ సైతం తుంగలో తొక్కారు.
- ఏళ్లు గడిచినా.. నాయకులు మారినా జంతిబంద తల రాత మారటం లేదు.. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక తీరడం లేదు.

మా చిరకాల కోరిక..



ఉద్దాన ప్రజల చిరకాల కోరిక జంతిబంద రిజర్వాయర్. రాజకీయాలకు అతీతంగా కృషిచేసి రిజర్వాయర్‌గా మారిస్తే ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీటి అవసరాలు తీరుతాయి. ఎడారిగా ఉన్న మా భూములు సస్యశ్యామలంగా మారుతాయి. కొబ్బరి తోటలకు కూడా ఊపిరిపోసినట్లు ఉంటుంది. రిజర్వాయర్ నిర్మాణం జరిగితే ఉద్దానంలో నీటి కొరత తీరుతుంది.

-కారి ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ, బేతాళపురం

వైసీపీ దగా చేసింది..



రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం ఉద్దానం అన్నదాతలను దగా చేసింది. జంతిబంద రిజర్వాయర్ నిర్మాణంలో వివక్ష చూపించింది. రైతుల కోసం ఈ ప్రాంతంలో ఒక్క పని కూడా చేపట్టలేదు. రిజర్వాయరు నిర్మాణాన్ని చేపట్టి ప్రజల కల నెరవేర్చాలి.

-సాలిన పార్వతి, మాజీ ఎంపీటీసీ, బహాడపల్లి

నిర్లక్ష్యం చేశారు..



రిజర్వాయరు నిర్మిస్తే తీరప్రాంతానికే ఆదర్శంగా నిలుస్తుంది. గతంలో రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో హామీలిచ్చి జంతిబందను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో అధికారులు వచ్చి సర్వే చేపట్టారు. పనులు ప్రారంభించలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చి ఐదేళ్లు గడిచినా పట్టించుకోవడం లేదు. నిధులు మంజూరై పనులు ప్రారంభమైతే ఉద్దానం ప్రాంత రైతులు సంతోషిస్తారు.

-నేరియా జ్యోతి, రైతు ప్రతినిధి, సరియాపల్లి

హామీ ఇచ్చారు.. అటకెక్కించారు

- అభివృద్ధిని మరిచిన వైసీపీ పాలకులు
- ఇదీ నరసన్నపేటలో కూరగాయల మార్కెట్ పరిస్థితి


నిరుపయోగంగా విశ్వేశ్వరయ్య కూరగాయల మార్కెట్‌లోని దుకాణాలు, రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

నరసన్నపేట: తాము అధికారంలోకి వస్తే నరసన్నపేట పట్టణంతోపాటు రోజువారీ కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని 2019 ఎన్నికల ముందు వైసీపీ నాయకులు ఇచ్చిన హామీ అటకెక్కింది. రోజువారీ మార్కెట్‌ను అభివృద్ధి చేసి కూరగాయాలు, చేపలు ఒక్కచోట లభించేలా చర్యలు తీసుకుంటామని ఐదేళ్ల కిందట వైసీపీ నాయ కులు ఎన్నికల ముందు పేర్కొన్నారు. హామీని విస్మరించడంతో ప్రస్తుతం నరసన్నపేట పంచాయతీ ఏటా లక్షలాది రూపాయల ఆదాయం కోల్పోవలసి వస్తోంది.

ఆదాయం కోల్పోతున్న పంచాయతీ

టీడీపీ హయంలో లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన కూరగాయలు మార్కెట్ ఆ తర్వాత అభివృద్ధికి నోచుకోలేదు. మార్కెట్ నిర్మించి 20 సంవత్స రాలు కావస్తున్నా పంచాయతీ అధికారులు పూర్తిస్థాయి వసతులు కల్పించ లేదు. వ్యాపారులు షాపులకు వెళ్లకుండా రోడ్లుపైనే దుకాణాలు ఏర్పాటు చేసి కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో పంచాయతీ ఏడాదికి సుమారు రూ.10 నుంచి రూ.17లక్షల వరకు ఆదాయం కోల్పోతోంది.

రోడ్డుపై వ్యాపారాలు.. ఖాళీగా దుకాణాలు

ఏడేళ్ల కిందట కూరగాయలు మార్కెట్‌లో 52 షాపులకు వేలంపాట నిర్వహించగా కేవలం ఐదు షాపులు మాత్రమే పాడారు. మిగతా 47 షాపులు వ్యాపారులు పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో జూనియర్ కళాశాల ముఖ ద్వారం నుంచి బజారువీధిలో కూరగాయలు మార్కెట్ వరకు సుమారు 70 మంది వ్యాపారులు రోడ్డుపైనే విక్రయిస్తున్నారు. వీరంతా దుకాణాలకు అద్దె చెల్లించనవసరం లేకుండాపోయింది. కేవలం పంచాయతీకి ఆశీలు మాత్రమే చెల్లించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో 47 దుకాణాలు ఖాళీగా ఉండడంతో పంచాయతీకి ఆదాయం రాకపోవడంతోపాటు శిథిలావస్థకు చేరుతున్నాయి.ఏడేళ్ల నుంచి కూరగాయల మార్కెట్‌లో ఐదు షాపుల కూడా ఎటువంటి అద్దె చెల్లించకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కూరగాయాలు మార్కెట్ మరింత అభివృద్ధి చేస్తామన్న ఎన్నికల్లో వైసీపీ నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, కళాశాల రోడ్డులో ట్రాఫిక్ నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

పట్టణంలోని విశ్వేశ్వరయ్య మార్కెట్‌లో దుకాణాలు వ్యాపారాలు సాగిం చకుండా వ్యాపారులు కళాశాల రోడ్డుపై కూరగాయలు, చేపలు విక్రయిస్తున్నారు. దీంతో ఈ రోడ్డులో ద్విచక్రవాహనాలు తప్పించుకోవడానికి వీల్లేకుండా పో యింది. ఇరువైపలా తోపుడు బళ్లు ఉండడంతో పట్టణంలోని పలు వీధుల వాసులు రాకపోకలకు అవస్థలకు గురవుతున్నారు. తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



పట్టణ నడిబొడ్డున ఉన్న విశ్వేశ్వరయ్య మార్కెట్‌లో దుకాణాలు నిత్యం గంజాయి, మందు తాగే వారికి అవాసాలుగా మారాయి. ఈ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పిన నాయకులు తర్వాత మరిచిపోతున్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

- ముద్దాడ గోపాలరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, మారుతీనగర్

ఇబ్బంది పడుతున్నాం



మార్కెట్‌లో షాపులు ఖాళీ ఉండటంతో వ్యాపా రులు రోడ్డు ఎక్కారు. కళాశాల రోడ్డులో కూరగాయాల వ్యాపారులు ఇరువైపుల తోపుడు బళ్లు ఏర్పాటు చేయడంతో మార్కెట్‌లో దిచక్రవాహనాలతో రావాలంటే ఇబ్బంది ఉంది. కూరగాయాల మార్కెట్‌ను అభివృద్ధి చేయాలి. ప్రజాధనం వృధాకాకుండా చూడాల్సి ఉంది.

- శారద, ఉపాధ్యాయిని, నరసన్నపేట

ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధం

జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగాన్ని సిద్ధంచేశారు. ఈ మేరకు తాజాగా వ్యయపరిశీలకులను నియమించారు. విజయనగరం లోక్‌సభ నియోజకవర్గంలోని జిల్లాలోని ఎచ్చెర్ల నియోజకవర్గం ఏర్పాట్లను కూడా జిల్లా యంత్రంగం పరిశీలిస్తోంది.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎన్నికల పరిశీలకులు..

శేఖర్ విద్యార్థి (ఐఏఎస్)	శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట	8199011111
సందీప్ కుమార్(ఐఏఎస్)	ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం	7880658442
టి.ప్రవేజ్ ఇక్బాల రోహెల్లా	ఎచ్చెర్ల, రాజాం, బొబ్బిలి, చీపురుపల్లి	9419400065
కేకే శ్రావణ్‌కుమార్, (ఐఆర్ఎస్)	వ్యయ పరిశీలకుడు (పార్లమెంట్)	8762302558
కోమల్జీత్ మీన(ఐఆర్ఎస్)	వ్యయ పరిశీలకుడు (శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట)	9116532168
నవీన్‌కుమార్ సోని(ఐఆర్ఎస్)	వ్యయ పరిశీలకుడు (ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం)	9582318110
సచీంద్ర పటేల్(ఐపీఆర్)	పోలీస్ అబ్జర్వర్	7800787895

నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులు..

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి	ఫోన్
ఇచ్ఛాపురం	బి సుదర్శనదొర	9494326124
పలాస	ఎస్ భరత్ నాయక్	8333989275
టెక్కలి	నూరుల్ కమర్	8333988802
పాతపట్టణం	ఎం అప్పారావు	8125213524
శ్రీకాకుళం	సీహెచ్ రంగయ్య	9573356699
ఆమదాలవలస	ఎం నవీన్(జేసీ)	8143193111
ఎచ్చెర్ల	ఎస్వీ లక్ష్మణమూర్తి	9121251111
నరసన్నపేట	జేవీఎస్ఎస్ రామ్మోహన్‌రావు	9440422302

- ఎన్నికలకు సంబంధించి జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్లు: 08942-240606, 240589, 295084, 18004256625

శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం పరిధి..

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్‌జండర్స్	మొత్తం
ఇచ్ఛాపురం	299	130544	137254	17	2,67,815
పలాస	284	106877	111709	21	2,18,607
టెక్కలి	315	117511	118129	9	2,35,649
పాతపట్నం	322	112095	112696	10	2,24,801
శ్రీకాకుళం	279	134866	137488	31	2,72,385
ఆమదాలవలస	259	95987	97477	15	1,93,479
నరసన్నపేట	290	106841	107434	13	214288
మొత్తం	**2048**	**804721**	**822187**	**116**	**162024**

విజయనగరం పార్లమెంట్ పరిధి...

ఎచ్చెర్ల	309	122669	121268	14	2,43,951

ఉద్యోగాలిస్తాం.. ఉద్యోగాలిస్తాం!

- మూలపేట పోర్టులో దువ్వాడ ప్రలోభాలు
- మోసపోవద్దంటున్న టీడీపీ నాయకులు
- నమ్మేది లేదంటున్న స్థానికులు

(టెక్కలి)





ఈ ఎన్నికల్లో వైసీపీ మూలపేట పోర్టును రాజకీయంగా వాడుకుంటుంది. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాంతీయులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ పార్టీ నాయకులు గ్రామాల్లో జరుగుతున్న ప్రచారాల్లో ఢంకా కొడుతున్నారు. అయితే మూలపేట పరిధిలో భూములు దారపోసిన రైతులకు, ఆ గ్రామ యువతకు కనీసం ఇప్పటివరకు జరగని న్యాయం, ఇప్పుడు ఎన్నికల వేళ ఏమి చేస్తారులే అంటూ అధికార పార్టీకి చెందిన నాయకులే కొందరు పెదవి విరుస్తున్నారు. ఎన్నికలకు కొద్దిరోజులు సమయం ఉండగా ఎమ్మెల్సీ, టెక్కలి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ తన అనుచరగణంతో పోర్టు అభివృద్ధి పరిశీలన పేరిట పర్యటనలు చేస్తూ ఈ ప్రాంత ప్రజానీకానికి నమ్మబలికే ప్రయత్నాలు చేస్తున్నారని ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు గుసగుసలాడుతున్నారు. వైసీపీ నాయకుల మాయమాటలు నమ్మవద్దని, అవన్నీ అబద్ధాలేనని ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పలు సమావేశాల్లో వెల్లడించారు. పోర్టును పార్టీ ఎన్నికల కార్యాలయంలా వాడుకుంటున్నారని, జెండా, అజెండాలకు అక్కడ నుంచే అధికార పార్టీ కార్యాచరణ ప్రణాళిక చేస్తుందని ఎంపీ రామ్మోహన్‌నాయుడు సైతం ఆరోపించారు. పోర్టులో కేజీఎఫ్ తరహా సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన అన్నారు. అయితే వైసీపీ మాత్రం పోర్టును ఎలాగైనా ఎన్నికల్లో వాడుకోవాలని చేయని ప్రయత్నాలంటూ లేవు. వారి బూటకపు మాటలు నమ్మవద్దంటూ టీడీపీ నాయకులు సైతం బదులిస్తున్నారు. కేవలం ఎన్నికల్లో ప్రచారం కోసం అధికార పార్టీ పోర్టును వాడుకుంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఈవీఎంలు వచ్చేశాయి..

- పలాస, సోంపేటకు చేరుకున్న బాక్స్‌లు
- స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచిన అధికారులు

పలాసరూరల్/సోంపేట, ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13వ తేదీన జరిగే పోలింగ్ కోసం అవసరమైన ఈవీఎంలు, ఈవీప్యాట్‌లు బుధవారం రాత్రి పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు చేరుకున్నాయి. వీటిని సంబంధిత అధికారులు స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరించారు. పలాస నియోజకవర్గంలో 284 పోలింగ్ కేంద్రాలు ఉండగా అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికలకు 684 ఈవీఎంలు వచ్చినట్లు పలాస ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్‌నాయక్ తెలిపారు. వాటిని టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, జనసేన పార్టీల నాయకుల సమక్షంలో పలాస జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆర్వో బి.సుదర్శన్ దొర, తహసీల్దార్ విజయ్‌కుమార్ సోంపేట జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. మొత్తం 299 పోలింగ్ బూత్‌లకు సంబంధించి 38బాక్సుల్లో ఈవీప్యాట్‌లు, ఈవీఎంలు చేరుకున్నాయి.


సోంపేటలో ఈవీఎం బాక్సులను దించుతున్న దృశ్యం


పలాసకు చేరుకున్న ఈవీఎం బాక్స్‌లు

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 17: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రూరల్ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ వాసుదేవరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఒప్పంగి గ్రామానికి చెందిన మంత్రి శ్రీధర్ (38) శ్రీకాకుళం నగరం డే అండ్ నైట్ కూడలిలో నాయుడు ట్రేడర్స్ అనే పురుగుల మందు దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇతనికి మాధవి అనే మహిళతో తొమ్మిదేళ్ల కిందట వివాహం జరుగగా ఏడాది న్నర కుమారుడున్నాడు. కొంతకాలంగా శ్రీధర్‌కు రూ.10 లక్షల వరకు అప్పులుండడం, వ్యాపారం సరిగా సాగకపోవడంతో అప్పులు తీర్చలేక మంగళవారం రాత్రి దుకాణం మూసి తన ద్విచక్రవాహనంపై బయటకు వచ్చి మునసబుపేట వద్ద ఓ ప్రైవేట్ లేఅవుట్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్థులు శ్రీధర్‌ను చూసి పోలీసులకు సమాచారం అందించారు. తొలుత మృతుడి ద్విచక్ర వాహనం పరిశీలించిన పోలీసులు కాసేపటికి అతని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే మృతుడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఐ కొట్టారని ఎస్పీకి యువకుడి ఫిర్యాదు

నరసన్నపేట: నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు తనపై చేయి చేసుకున్నారని ఎస్పీ జీఆర్ రాధికకు ఫిర్యాదు చేసినట్లు కరగాం గ్రామానికి చెందిన యాళ్ల మల్లేశ్వరరావు తెలిపారు. ఈనెల 14న గ్రామంలో ఇంటి నిర్మాణం విషయంలో తలెత్తిన వివాదంలో తాను పెద్దమనిషిగా వెళ్లగా ఒకే వర్గంవైపు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించిన తీరును ప్రశ్నించినందుకు తనపై ఎస్ఐ దాడికి పాల్పడినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చికిత్స నిమిత్తం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చేరారు. ఈవిషయమై సీఐ ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా ఎస్పీ గ్రీవెన్స్‌లో మల్లేశ్వరరావు ఫిర్యాదు చేశారని, ఎస్పీ ఆదేశాల మేరకు టెక్కలి డీఎస్పీ విచారణ చేపడతారన్నారు.

మెకానిక్ షాపు దగ్ధం

మందస: మందస మెయిన్‌రోడ్డు బజారు కూడలి వద్ద సైకిల్ మెకానిక్ షాపులో అగ్నిప్రమాదం సంభవించింది. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో షాపు యజమాని గయా విశ్వనాథం షాపును మూసి వేసి ఇంటికి వెళ్లగా ఒక్కసారిగా షాపులో మంటలు చెలరేగాయి. సైకిల్ టైర్లు, సామాన్లు మొత్తం దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపకశాఖాధికారులు ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. నష్టం విలువ రూ.3లక్షలు ఉంటుందని అంచనా.

పిల్లలవలసలో చెరుకు తోట..

పొందూరు: పిల్లలవలసలో వావిలపల్లి తిరుమలరావు, గురుగుబెల్లి ముకుందరావులకు చెందిన చెరుకు తోటలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. సమీపంలో చెరువు వద్ద రెల్లిపొదలకు పెట్టిన మంటలు చెరుకుతోట వ్యాపించి ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. వెంటనే అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకున్నారు. పెద్దగా ఆస్తినష్టం జరగలేదు.

కంద్రవీధిలో పూరిళ్లు..

టెక్కలి: టెక్కలి కంద్రవీధిలో బుధవారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో అనంత ఉపేంద్ర, కార్తీక్, అమరనాథ్‌ల పూరిళ్లు పూర్తిగా కలిపోయాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శకటం వచ్చేలోగా రెండిళ్లు పూర్తిగా, మరో ఇల్లు పాక్షికంగా కాలిపోయాయి. సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ సంఘటనలో ఇంట్లో దాచుకున్న రూ.5లక్షల నగదు కూడా కాలిపోయిందని మత్స్యకార సొసైటీ సంఘ సభ్యుడు కార్తీక్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద తెలుసుకున్న టీడీపీ నాయకులు బగాది శేషగిరి, లవకుమార్, మామిడి రాము, మట్ట పురుషోత్తం, మట్ట సుందరమ్మ, గండి చంద్రరావు తదితరులు అక్కడికి చేరుకొని అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించి ఓదార్చారు.

ఉల్లాసపేటలో జీడి, టేకు తోట..

మెళియాపుట్టి: ఉల్లాస పేట సమీపంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు మూడెకరాల్లో జీడి, టేకు మొక్కలు దగ్ధమయ్యాయి. దీంతో రైతు నక్క ముత్యాలమ్మ లబోదిబోమంటోంది. ఒక్కసారి తోటలో మంట లు వ్యాపించి మొక్కలు కాలిపోవడంతో టెక్కలి నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రెవెన్యూ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించాలని బాధితురాలు కోరారు.

23 మద్యం బాటిళ్ల స్వాధీనం

పాతపట్నం: స్థానిక చెక్‌పోస్టు వద్ద బుధవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.3050 విలువ చేసే 23 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. బాటిళ్లను స్కూటీని స్వాధీనం చేసుకున్నామన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం: తన కుమార్తె ఇంట్లో ఎవరికీ అదృశ్యమైనట్లు తండ్రి ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. సారంగడోలా వీధికి చెందిన బూర రాజేశ్వరరావు జీటీ రోడ్డులో ఫుట్ పాత్‌లపై వస్త్రాలు విక్రయిస్తుంటాడు. భార్య హేమ ఇంట్లో టిఫిన్ తయారు చేసి విక్రయిస్తున్నారు. వీరికి వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె యమున ఉమెన్స్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఈనెల 16 రాత్రి 9 గంటలకు ఇంట్లో అందరూ భోజనం చేసి పడుకోగా యమున ఇంటి గోడపై నుంచి దూకి పారిపోయిందని చిన్న కుమార్తె తల్లిదండ్రులకు చెప్పింది. కంపోస్టు కాలనీలో ఉన్న ఓ వ్యక్తితో ప్రేమలో ఉందని, అతని మీదే అనుమానం ఉందని యువతి తండ్రి రాజేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేశారు.

జీడి, కొబ్బరి రైతులను ఆదుకోవాలి

పలాసరూరల్/కాశీబుగ్గ: జీడి, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు పత్రి దానేసు అన్నారు. సంఘం ప్రతినిధులు ఉద్దానం ప్రాంతాల్లో బుధవారం పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో జీడి, కొబ్బరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంతంలో చుట్టూ ఉన్న నదుల్లో నీరున్నా తాగు, సాగునీటికోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. జిల్లా యంత్రాంగం గ్రామాల్లో పర్యటించి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామారావు, కార్యదర్శి పిండి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం చేసే వారికే ఓట్లు వేయాలి

మెళియాపుట్టి: గిరిజనులకు న్యాయం చేసిన పార్టీలకే ఓట్లు వేయాలని దండకారణ్య లిబరేషన్ సంఘం జిల్లా అధ్యక్షుడు సవర కుమార్ కోరారు. బుధవారం దానుపురం, సరప చీపురుపల్లి గ్రామాల్లో గిరిజనులను చైత న్యం చేశారు. గత ఐదేళ్లుగా అనేక జీవోలతో గిరిజనాభివృద్ధికి అడ్డుపడుతున్న పార్టీలను ఆదరిస్తే మళ్లీ గిరిజనుల బతుకులు అధోగతి పాలవుతాయన్నారు. గిరిజనుల ఉపాధి, అభివృద్ధి చేసే పార్టీలను గెలిపించాలని కోరారు.

చిరుజల్లులతో ఊరట





శ్రీకాకుళంలో వర్షం, జలుమూరు: ధాన్యం బస్తాలపై కప్పుతున్న టార్పాలిన్లు

వజ్రపుకొత్తూరు/జలు మూరు/శ్రీకాకుళం అర్బన్: ఉదయం నుంచి ఎండతీవ్రత అధి కంగా ఉండగా రాత్రి ఒక్కసారి చిరుజల్లులు కురిశాయి. శ్రీకాకుళం నగరంతో పాటు వజ్రపుకొత్తూరు, జలుమూరు మండలాల్లో చిరుజ ల్లులు కురవడంతో ప్రజలు కొంత మేర ఉపశమనం పొందారు. జల్లులు ఒక్కసారి పడడంతో పండిన పంటలు ఇళ్లకు తెచ్చుకునేందుకు అవకాశం లేక రోడ్లు, కళ్లాల్లో ఉంచిన పంటలపై టార్పాలిన్లు కప్పేందుకు రైతులు అవస్థలు పడ్డారు.

ఘనంగా ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం

కంచిలి: మండలంలోని నువాగడ ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్, యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం దుర్గాప్రసాద్ పాడిని సత్కరించారు. కార్యక్రమంలో డీఐవో (ఒడియా) దుర్గాప్రసాద్ చౌదరి, అపోటా అధ్యక్షుడు భాస్కర్ పాడి, బృందావన్ దొళాయి, కంచిలి ఎంఈవో-2 చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లు పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నందున పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్న గ్రామాలను సీఐ, ఎస్ఐలు స్వయంగా సందర్శించి ప్రజలతో తరచూ చర్చించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు సరిహద్దు చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, సీఐ, డీఎస్పీలు తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు డా.జి.ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వరరావు, డీఎస్పీ, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని కల్యాణంలో పాల్గొన్న ఎస్పీ

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల సాయుధ పోలీసు క్వార్టర్స్‌లోని కోదండ రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం వేడుకగా జరిగింది. ఎస్పీ జీఆర్ రాధిక దంపతులు పాల్గొని స్వామికి పట్టువస్త్రాలు సమర్పించగా అర్చకులు వారితో కల్యాణం చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ధర్మం, సత్యం సిద్ధాంతాలను ఆచరించిన శ్రీరాముడు మార్గదర్శకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు జి.ప్రేమ్ కాజల్, వి.ఉమామహేశ్వరరావు, డీఎస్పీలు వై.శ్రుతి, ఎల్.శేషాద్రి నాయుడు, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, సాయుధ పోలీసులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎస్పీ రాధిక దంపతులు

రోడ్డే వేయించలేని మంత్రి అభివృద్ధేం చేస్తారు: ఎంపీ



ఆదిత్యనాయుడుకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ రామ్మోహన్, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం-ఆమదాలవలస ప్రధాన రోడ్డును వేయించలేని మంత్రి ధర్మాన నియోజకవర్గ అభివృద్ధి ఏం చేస్తారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. బుధవారం సింగుపురం గ్రామంలో ప్రజాగళం, సూపర్ సిక్స్‌పై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో గాలికి కూడా పన్ను చెల్లించే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఆమదాలవలసకు వెళ్లే ప్రధానం మార్గంలో ప్రయాణించాలంటేనే భయపడుతు న్నారని, ఎందరో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా తనను, ఎమ్మె ల్యేగా గొండు శంకర్‌ను గెలిపించాలని కోరారు.

సింగుపురం సర్పంచ్ టీడీపీలో చేరిక

సింగుపురం వైసీపీ సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు 300 మంది అనుచరులతో టీడీపీలో చేరారు. వీరికి ఎంపీ రామ్మోహన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే మాజీ సర్పంచ్ గుండ మోహన్ కూడా టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణ, ముద్దాడ కృష్ణ, దశరథ్, అరవల రవీంద్ర, జనసేన నాయకుడు కోరాడ సర్వేశ్వరరావు, బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలం, శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల నుంచి టీడీపీలో చేరికలు



టీడీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎంజీఆర్

మెళియాపుట్టి/ పాతపట్నం: పాతపట్నం ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావుకు పలు గ్రామాల వైసీపీ నేతలు మద్దతు తెలిపారు. ఈ మేరకు బుధవారం మెళియాపుట్టి మండలం కొసమాల, జాడుపల్లి చీపురుపల్లి పరశురాంపురం, టకోయిగాతవలస తదితర గ్రామాల నుంచి పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి గోవిందరావు కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో జాడుపల్లి ఎంపీటీసీ సభ్యుడు కదంబాల పైడిరాజ్‌తో పాటు ఆయా గ్రామాల నేతలు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సలాన మోహనరావు, రాజశేఖరెడ్డి, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని రక్షించుకోండి

ఆమదాలవలస: రాష్ట్రంలో సైకో సీఎం జగన్‌రెడ్డి చేతకాని పాలనతో రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉందని, దీనిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవి కుమార్ అన్నారు. బుధవారం కొర్లకోట గ్రామంలో టీడీపీ శంఖారావం, సూపర్ సిక్స్‌పై అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా రవికుమార్‌ను గెలిపించాలని ఎంపీ కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లీశ్వరరావు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు బి.ఉమామహేశ్వరరావు, పాత్రుని పాపారావు, సూరప్పలనాయుడు, నూకరాజు, తమ్మినేని చంద్రశేఖర్, విద్యాసాగర్, మెట్ట సుజాత తదితరులు పాల్గొన్నారు. ● అయ్యవారిపేట వైసీపీ సర్పంచ్ ఇప్పిలి అంబుజాక్షి, సిమ్మన్న, బెలమాం మాజీ సర్పంచ్ సీపాన వెంకటరమణ తదితరులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వీరికి ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. ● **పొందూరు:** జోగన్నపేట గ్రామం నుంచి 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి రవికుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎ. చినరంగ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన సర్పంచ్, వార్డు మెంబర్లతో రవికుమార్

ఎల్లవేళలా అండగా ఉంటా: ఎమ్మెల్యే అశోక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. కవిటిలో అగ్నికుల క్షత్రియ సంఘ సమావేశంలో బుధవారం పాల్గొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబు హయాం లోనే జరిగిందని, అన్ని వర్గాలకు న్యాయం చేశామన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి మ్యానిఫెస్టోను అమలు చేసి అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. సమావేశంలో కులపెద్ద పి.లక్ష్మణ మూర్తి, టీడీపీ నేతలు బి.రమేష్, వి.రంగారావు, బి.కామరాజు, ఎ.రాజు పాల్గొన్నారు.

నదీతీర గ్రామాలపై నిర్లక్ష్యం: బగ్గు

నరసన్నపేట: నదీ తీర గ్రామాల్లో ఇసుక తవ్వకాలతో రోడ్లను ఛిద్రం చేసి గ్రామాలపై నిర్లక్ష్యం వహించిన నాయకులకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఉమ్మడి పార్టీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం గోపాలపెంట పంచాయతీ గోపాలపెంట, గదిలిపేట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి చూసిన నాయకుడ్ని ఎన్ను కోవాలన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నాయకులు శిమ్మ చంద్రశేఖర్, బలగ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధి హామీ వేతనదారులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు.



బగ్గు రమణమూర్తికి హారతి ఇస్తున్న మహిళలు



టెక్కలి: నిర్మానుష్యంగా ఉన్న ఇందిరాగాంధీ కూడలి

భానుడి ప్రతాపం

కవిటి/టెక్కలి: భానుడు తన ఉగ్రరూపం చూపుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 6 గంటల వరకు ఎండవేడిమితో ప్రజలు అల్లాడుతున్నారు. వివిధ పనులపై బయటకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం కూడా జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత అధికంగా ఉంది. ఎండల వేడిమికి వృద్ధులు, పిల్లలు, గర్భిణులు అల్లాడుతున్నారు. కవిటి, టెక్కలి పట్టణాల్లో రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. కూలింగ్ వాటర్ బాటిళ్లు, జ్యూస్‌లకు డిమాండ్ పెరిగింది.

విధ్వంస పాలనకు స్వస్తి పలకాలి

ఆమదాలవలస: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ విధ్వంస పాలనకు ప్రజలు స్వస్తి పలకాలని ఆమదాలవలస కాంగ్రెస్ అభ్యర్థి సనపల అన్నాజీరావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొడ్డేపల్లి గోవిందగోపాల్, డీసీసీ ప్రధాన కార్యదర్శి లక్కినేని నారాయణరావు, శ్రీనివాస రావు పాల్గొన్నారు.

నేడు మండలంలో అచ్చెన్న పర్యటన

నందిగాం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం మండలంలో పర్యటించనున్నట్లు పార్టీ నాయకులు పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ తెలిపారు. గొల్లూరు, రాంపురం, రధజనబొడ్డపాడు పంచాయతీల్లో మధ్యాహ్నం 4 గంటల నుంచి పర్యటిస్తారని, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ముగిసిన భాగవత సప్తాహం

నందిగాం: దిమ్మిడిజోలలో ఈనెల 10 నుంచి ప్రారంభమైన భాగవత సప్తాహం మంగళవారం ముగిసింది. పురోహితుడు మదన్‌మోహన్ మిశ్రో నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. పలువురు స్థానికులు పాల్గొన్నారు.

బెర్మ్‌లు వేశారు

జి.సిగడాం: పెంట నుంచి పొగిరి కూడలికి వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర రోడ్డు పక్కన బెర్మ్‌లను వేశారు. ఈనెల 14న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఈ మేరకు బెర్మ్‌లను వేశారు. రోడ్డు మరమ్మతులకు గురికాకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

21న కృపారాణి నామినేషన్

టెక్కలి: టెక్కలి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి ఈనెల 21న నామినేషన్ వేయనున్నట్లు కాంగ్రెస్ కార్యాలయ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ముఖ్య అనుచరులతో కలిసి నామినేషన్ వేయనున్నారని ఆయన పేర్కొన్నారు.

జనసేనలో చేరిన తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్



నరసన్నపేట: నడగాం గ్రామానికి చెందిన వైసీపీ నేత, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఆ పార్టీకి, పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. బుధవారం జనసేన సీనియర్ నేత నాగబాబు ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ● **శ్రీకాకుళం అర్బన్:** జిల్లా కేంద్రంలోని జనసేన కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిశిని చంద్రమోహన్ సమక్షంలో పలువురు యువకులు చేరారు. బుధవారం సారవకోట మండలానికి చెందిన 50 మంది యువత జనసేనలో చేరగా వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించేందుకు పాటుపడాలని కోరారు.

సర్వేపల్లికి నివాళి

పాతపట్నం: స్థానిక నవజీవన్ ఆశ్రమంలో డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ 49వ వర్ధంతిని రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. విశ్రాంత తెలుగు పండితుడు బందన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడి నుంచి దేశ రాష్ట్రపతిగా స్థాయి వరకు వెళ్లి దేశానికి సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జీడి పరిశ్రమలో మాక్‌డ్రిల్

పలాస: అగ్నిమాపకవారోత్సవాల భాగంగా పరిశ్రమల్లో అగ్నిప్రమాల నివారణపై స్థానిక అగ్నిమాపక అధికారులు బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఓ సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు సంపద సృష్టిస్తే.. జగన్ దోచుకున్నాడు

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు



ప్రచారంలో పాల్గొన్న అచ్చెన్నాయుడు

టెక్కలి, ఏప్రిల్ 17: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో సంపదను సృష్టిస్తే ఇప్పటి సీఎం జగన్‌రెడ్డి ఆ సంపదను దోచుకుతిన్నాడని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం రాత్రి కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి బస్సుయాత్ర తుస్సు మనడంతో మరో గులకరాయి డ్రామాకు తెరలేపాడన్నారు. ఇదంతా చంద్ర బాబు చేసిన హత్యాయత్నమని ఆరోపణలను జగన్‌రెడ్డి గుప్పించాడని, అధికారం మీ చేతిలో ఉంది, పోలీసులు మీ చేతిలో ఉన్నారు.. వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనతో పాటు ఎంపీగా రామ్మోహన్‌నాయుడును గెలి పించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు హరివరప్రసాద్, బోయిన గోవింద రాజులు, రమేష్, వెలమల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలన పోవాలని ఎదురుచూస్తున్నాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం కురుడు, పాకివలస, మెండపేట ప్రాంతాల మీదుగా సరియాపల్లి, కొత్తపల్లి ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా దారిలో పలువురు ఉపాధి కూలీలు ఆయనను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ.. సైకోపాలన పోవాలని తామంతా ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్నామన్నారు. టీడీపీని గెలిపించాలని అచ్చెన్న కోరారు.

అచ్చెన్న సమక్షంలో పలువురి చేరిక

సంతబొమ్మాళి మండలం లక్కివలస పంచాయతీ నుంచి పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన పిట్ట దండాసి, కామయ్య, తూలు కామరాజు, ఎర్రన్న, చిన్నారావు తదితర 100 కుటుంబాలు పార్టీలో చేరగా వారికి కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈనెల 22న నామినేషన్ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలి రావాలని అచ్చెన్నాయుడు కోరారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి: శిరీష



టీడీపీలో చేరిన వారితో గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు: టీడీపీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. బుధవారం నగరంపల్లిలో స్థానిక మాజీ సర్పంచ్ దువ్వాడ జయరాం చౌదరి ఆధ్వర్యంలో 20 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వారికి శిరీష కండువా వేసి ఆహ్వానించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు సాగునీరందించలేక పోయారని విమర్శించారు. సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. టీడీపీలో చేరిన వారిలో సనపల ఈశ్వరప్ప, సనపల సుదర్శనరావు దండాశి ఉన్నారు. కార్యక్ర మంలో నాయకులు దుర్గారావు, కణితి సురేష్, దువ్వాడ హేంబాబు చౌదరి, సనపల చక్రవర్తి, దువ్వాడ అప్పారావు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి



ప్రచారం చేస్తున్న నడుకుదిటి రజిని

రణస్థలం: ఉమ్మడి పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు సతీమణి రజిని కోరారు. బుధవారం జేఆర్ పురం పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుపై తన భర్త ఈశ్వరరావు, ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడు సైకిల్ గుర్తుపై పోటీ చేస్తున్నారని, వారిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం శ్రీనివాసరావు, కొప్పిశెట్టి లక్ష్మణరావు, దన్నాన మహేష్, జయన్ లక్ష్మణ, రాయిపురెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం: గుండ అనుచరులు

అరసవల్లి: క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకుంటున్నామని మాజీమంత్రి గుండ దంపతులు ప్రకటించిన నేపథ్యంలో ఇన్నాళ్లు వారితో నడిచిన మేమంతా ఇకపై కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ గెలుపు కోసం పని చేయాలని నిర్ణయించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ అధ్యక్షతన డివిజన్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇన్నాళ్లు క్రమశిక్షణతో పార్టీ కోసం పనిచేశామని, ఇకపై కూడా అదే మాదిరిగా పనిచేస్తామన్నారు. పార్టీకి విధేయతతో ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్, ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెంట నడిచి వారి విజయం కోసం శతశాతం పనిచేస్తామన్నారు. మరో ఆలోచనకు తావు లేదని స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, అధికార ప్రతి నిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ మాదిగ, జామి భీమశంకర్, కలగ జగదీష్, బలగ చెంగల్రావు, కొమ్మనాపల్లి వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

శిరీష గెలుపును ఎవరూ ఆపలేరు

పలాస/కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో గౌతు శిరీష గెలుపు, మంత్రి అప్పలరాజు ఓటమిని ఎవరూ ఆపలేరని టీడీపీ నాయకుడు, సీనియర్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రిక్షా, తోపుడుబళ్ల కార్మికులు, పెయింటింగ్ అసోసియేషన్, తాపీమేస్త్రీల సంఘం నాయకులను కలిసి శిరీషను గెలిపించాలని కోరారు.

ఏఎంసీ ఆవరణలోకి వాకర్స్‌కి అనుమతి లేదు

పాతపట్నం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో ఎన్నికల స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేసిన నేపథ్యంలో పట్టణ వాకర్స్ ప్రవేశించకుండ కూడదని ఎస్ఐ మహమ్మద్ యాశిన్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ సిబ్బంది, ఏఎంసీ సిబ్బంది మినహా ఇతరులెవరూ ప్రవేశించకుండా నిషేధించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని వాకర్స్ గమనించి సహకరించాలని కోరారు.

